క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: మరమ్మతుల నిమిత్తం పాలకొల్లు పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీరాంపేట, మెయిన్‌రోడ్డు, శంభునిపేట, సూర్యతేజస్ నగర్, సుబ్బారాయుడు గుడి సెంటర్, హౌసింగ్ బోర్డు కాలనీ, లజపతిరాయ్ పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేపీపాలెం సబ్ స్టేషన్‌లో పరిధిలో..

మొగల్తూరు: కేపీపాలెం సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



బస్టాండ్‌లో ఎయిడ్స్‌పై కళా ప్రదర్శన

నరసాపురం: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నరసాపురం బస్టాండ్‌లో మిరయాల రవిబాబు బృందం కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. నాటిక, పాటలు ద్వారా ప్రదర్శన ఇచ్చారు. ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలు, నివారణ చర్యలను వివరించారు. మందుల ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 తదితర అంశాలను తెలియజేశారు. కేవైఎస్ఎస్ సిబ్బంది ఎస్ రవికిరణ్, పద్మ, సుజాత, జీవై కుమారి, ఇందు, ఐసీటీసీ, ఎన్‌జీఓ సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరికి తరలిన ఎమ్మెల్యే, నాయకులు



మంగళగిరిలో సమావేశానికి హజరైన ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, నాయకులు

పెనుగొండ: మంగళగిరిలో జరిగిన మేము సిద్ధం.. మా పోలింగ్ బూత్ సిద్ధం సమావేశానికి ఆచంట నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. మంగళవారం ఉదయమే ఆచంట నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లారు. ఎన్నికలో విజయానికి సిద్ధం అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యూహంతో నూతనోత్సాహం నెలకొందంటూ సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, ఆచంట మండలాల నుంచి నాయకులు తరలి వెళ్లారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న పవన్‌కుమార్

పాలకొల్లు అర్బన్: పేద విద్యార్థులు చదువులు ఆగిపోకూడదని లక్ష్యంతో కోట్ల విలువైన ఆస్తులను ట్రస్టుకు కేటాయించిన మహనీయురాలు మన్యం జగ్గమ్మగారని ఆ సత్రం చైర్మన్ నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీ మన్యం జగ్గమ్మగారి జ్ఞాపకార్థం సత్రం కార్యాలయ ఆవరణలో మంగళవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. బ్రాహ్మణులకు పంచి, కండువాలు అందజేశారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు మెంట వెంకట సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, అమలాపురపు బాల సుబ్రహ్మణ్యేశ్వరి, పిల్లా రాజేశ్వరి, బద్దా పార్వతి, ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, చల్లా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ మౌనికకు డాక్టరేట్



నరసాపురం రూరల్: నరసాపురం మండలం దర్భరేవు గ్రామ సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శి రుస్తుంబాదకు చెందిన వడ్లపాటి మౌనిక పెర్సిస్‌కు డాక్టరేట్ లభించింది. బిఎస్సీ, బిఈడీ, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన ఆమె గతంలో సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సచివాలయంలో పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తి చేశారు. మౌనిక పెర్సిస్ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ సంధ్యా శ్రీదేవి ఆధ్వర్యంలో హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై పరిశోధన చేశానన్నారు. ఈ పరిశోధన పూర్తి చేయడంలో తన భర్త మీసరపు శ్యాంబాబు ప్రోత్సాహం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా మైనికా పెర్సిస్‌ను దర్భరేవు, సీతారాంపురం సౌత్, రుస్తుంబాద గ్రామాల సర్పంచ్‌లు, పెన్మెత్స విజయలక్ష్మి, దొండపాటి వెంకట్, బందెల భారతి, ఎంపీడీఓ ఎంవీ రమణారావు, ఎస్సై గురవయ్య, తదితరులు అభినందించారు.

అభివృద్ధికి కేరాఫ్ పాలకొల్లు సచివాలయం-1

- రూ.45 కోట్ల అభివృద్ధి, సంక్షేమం
- పాఠశాలలకు కార్పొరేట్ హంగులు



పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో బ్రాడీపేట 1, 2, 3 వార్డులు ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ వార్డుల్లోని సీసీ రోడ్లు పల్లంగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే నీట ముంపునకు గురయ్యేవి. సింగోడియన్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల పనులు సకాలంలో పూర్తిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. నాడు రెండో వార్డు కౌన్సిలరే మునిసిపల్ చైర్మన్ అయినా అభివృద్ధిని పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో 1, 2, 3 వార్డుల రూపురేఖలు మారిపోయాయి. సచివాలయం-1 అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. ఈ మూడు వార్డుల్లో అత్యధికంగా తూర్పుకాపు సామాజిక వర్గం, వడ్డీలు, బ్రాహ్మణులు, కాపులు, ఎస్సీలు, మైనార్టీలు ఉన్నారు. జనాభా పురుషులు 2,684, మహిళలు 2,957 మంది ఉన్నారు. పురుషులు 2,149, మహిళలు 2,337 మంది ఓటర్లు ఉన్నారు.

అభివృద్ధి ఇలా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 1, 2, 3 వార్డుల్లోని 14,344 మందికి ఈ నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ. 25.97 కోట్ల లబ్ధి చేకూరింది. డీబీటీ ద్వారా రూ.16.60 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.8.19 కోట్ల లబ్ధి చేకూరింది. సింగోడియన్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల గత ప్రభుత్వంలో రూ.30 లక్షలతో పనులు ప్రారంభించి పూర్తిచేయలేదు. దీంతో ఆ పనులను నాడు నేడు నిధులు రూ.25.40 లక్షలు వెచ్చించి పూర్తిచేశారు. ఏవీఎస్ఎన్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలకు నాడు నేడు మొదటి ఫేజ్‌లో రూ.35 లక్షలు, రెండో ఫేజ్‌లో రూ.96 లక్షలు, రేపాక మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలు వెచ్చించి అదనపు గదులతో కార్పొరేట్ స్థాయి హంగులు సమకూర్చారు. రెండో వార్డులో రూ.15 కోట్లతో తాగునీటి ఫిల్టర్ బెడ్ నిర్మించారు. ప్రస్తుతం వాటర్ పంప్ హౌస్ రూ.40 లక్షలతో నిర్మిస్తున్నారు. గడపగడపకు మనప్రభుత్వం నిధులు రూ.40 లక్షలు, జనరల్ ఫండ్ రూ.60 లక్షలతో ఈ వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు.



ఏవీఎస్ఎన్ఎం హైస్కూల్ దుస్థితి (నాడు)



హైస్కూల్‌కు హంగులు (నేడు)



సింగోడియన్ పాఠశాలలో వాటర్ ప్లాంట్



వర్షం వస్తే నాటి మునిసిపల్ చైర్మన్ వార్డు దుస్థితి



సింగోడియన్ ఎలిమెంటరీ స్కూల్ (నాడు)



సింగోడియన్ పాఠశాల రమణీయం (నేడు)



సీసీ రోడ్లతో అభివృద్ధి (నేడు)



రెండో వార్డులో రూ.15 కోట్లతో నిర్మించిన వాటర్ ప్లాంట్

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
జగనన్న అమ్మఒడి	1052	రూ.1.94 కోట్లు
జగనన్న వసతి దీవెన	491	రూ.48.98 లక్షలు
జగనన్న విద్యా దీవెన	664	రూ.1.34 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	289	రూ.58 లక్షలు
వైఎస్సార్ రైతు సున్నా వడ్డీ	56	రూ.1.09 లక్షలు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	50	రూ.9.42 లక్షలు
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	63	రూ.5.14 లక్షలు
వైఎస్సార్ మహిళా సున్నా	వడ్డీ 989	రూ.50.86 లక్షలు
వైఎస్సార్ పింఛన్ కానుక	660	రూ.6.11 కోట్లు
వైఎస్సార్ చేయూత	311	రూ.1.36 కోట్లు
వైఎస్సార్ ఆసరా	858	రూ.2.46 కోట్లు
వైఎస్సార్ భీమా క్లెయిమ్	14	రూ.34.60 లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	30	రూ.11.55 లక్షలు
జగనన్న చేదోడు	12	రూ.3 లక్షలు
వైఎస్సార్ లా నేస్తం	3	రూ.1.80 లక్షలు
వైఎస్సార్ వాహన మిత్ర	22	రూ.6.30 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	91	రూ.6.21 లక్షలు
అగ్రి గోల్డ్	70	రూ.10.50 లక్షలు
అర్చకులు, పాస్టర్లు, మౌజమ్, ఇమామ్‌లు	5	రూ.75 వేలు
స్పెషల్ కోవిడ్ సాయం	1220	రూ.12.20 లక్షలు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	39	రూ.11.70 లక్షలు
జగనన్న విద్యా కానుక	197	రూ.13.90 లక్షలు
ఇళ్ల స్థలాలు	161	రూ.3.96 కోట్లు
విద్యార్థులకు టాబ్‌లు	22	రూ.2.90 లక్షలు
జగనన్న గోరుముద్ద	205	రూ.20.30 లక్షలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	317	59.30 లక్షలు
ఇంటింటికీ రేషన్	1348	రూ.2.94 కోట్లు

సంక్షేమ, అభివృద్ధి జగనన్నకే సాధ్యం



ఎన్నడూ లేని విధంగా రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టడం అభినందనీయం. ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయి. ఒకే సచివాలయం పరిధిలో సుమారు రూ.45 కోట్లు ఖర్చు చేయడం అభివృద్ధికి నిదర్శనం. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన చేయడం జగనన్నకే సాధ్యం.

– ముత్యాలపల్లి పెద్దిరాజు, 3వ వార్డు, పాలకొల్లు

రోడ్లు చూస్తే ఆనందంగా ఉంది



వలంటీర్ల రాకతో పింఛన్ల కోసం ఎదురుచూడాల్సిన అవసరం పోయింది. ఇక్కడ రోడ్లు కొద్దిపాటి వర్షానికే జలమయమయ్యేవి. నేడు ఆ పరిస్థితి పోయింది. రోడ్లన్నీ నిర్మించడం ఆనందంగా ఉంది. ఈ వార్డులో ఉన్న పాఠశాలలకు కార్పొరేట్ హంగులు తీసుకొచ్చారు. జగనన్న ప్రభుత్వంలో పేదలకు ఇబ్బందులు పోయాయి.

– జి.లక్ష్మి, 2వ వార్డు పాలకొల్లు

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా



కొమ్ముచిక్కాలలో శిబిరంలో పాల్గొన్న జెడ్పీటీసీ పెద్దిరాజు, నాయకులు



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీపార్వతి

పోడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు అన్నారు. కొమ్ముచిక్కాల గ్రామంలో మంగళవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరి చంటిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగరాజు బాలాజీ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బాలాజీవర్మ, చంటిరాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వాసవి, నాగలక్ష్మి, సూపర్ వైజర్లు పద్మ, జయమణి, మూర్తి, పీహెచ్ఎన్ మేరీగ్రేస్, సీహెచ్‌ఓలు వీరమ్మ, సత్యనారాయణ, ఏఎన్ఎంలు శాంతిప్రియ, జి.శేషారత్నం, భాగ్య, సామ్యేల్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరవల్లి దుర్గారావు, యరకరాజు పెద్దిరాజు, తానేటి సురేష్ కొండరాజు, నాగరాజు రమేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

మొగల్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ దినేష్ సూచించారు. మంగళవారం మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 362 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వీరిలో 24 మందికి కళ్లజోళ్లు, 18 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు డాక్టర్ దినేష్ తెలిపారు. డాక్టర్లు లక్ష్మీపార్వతి, జేఈఎస్ గణేష్ బాబు, ఫణీంద్ర, టి.వాసు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎన్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులకు కళాశాల సమయం కీలకమైనదని అన్నారు. క్రమశిక్షణ, జీవితంపై సరైన లక్ష్యాలు నిర్ణయించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సభకు ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు అధ్యక్షత వహించగా, కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామ్, జీబీ మెంబర్లు చేగొండి సూర్యనారాయణ, సీహెచ్ రెడ్డప్పధవేజీ, పీజీ కోర్సుల డైరెక్టర్ నిమ్మల చింతారావు, డీన్ గంధం శ్రీ రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక వేడుకలు



పూజ చేస్తున్న ఆలయ నిర్మాణ దాతలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని తిల్లపూడి గ్రామ దేవత తిళ్లపాయిలమ్మ, మారెమ్మ అమ్మవార్ల ఆయల మూడో వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు కామిశెట్టి రంగారావు, సీతామహాలక్ష్మి, స్వామి అయ్యప్పనాయుడు, నాగదేవి, సత్యనారాయణ, లక్ష్మి దంపతులచే ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి) బ్రహ్మత్వంలో 12 మంది అర్చకులు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. గ్రామ సర్పంచ్ నడపన శ్రీనివాసరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు నడపన చినసత్యనారాయణ, ఎంపీటీసీ నడపన నరసింహస్వామి, నడపన పురుషోత్తం (బాబ్జి), నడపన జగపతి, నడపన చల్లాలు, నడపన కృష్ణమూర్తి (సీఎం) తదితరులు పాల్గొన్నారు.

2న మండల పరిషత్ సమావేశం

పాలకొల్లు అర్బన్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొనాలని అనుపమ కోరారు.

నేడు ఎల్బీచర్లలో పార్వతీ సోమేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో పునర్నిర్మించిన పురాతన శ్రీపార్వతీ సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10.03 గంటలకు పార్వతీ సోమేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేసినట్టు ఆలయ కమిటీ పేర్కొంది. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు హాజరవుతున్నట్టు తెలిపింది. ఈ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గా ప్రసాద్‌శర్మ, మంచిలి పురుషోత్తమశర్మల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణాధికారి పులగం వేణుగోపాలరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

పాలకొల్లు మునిసిపల్ కమిషనర్ బదిలీ



విజయ పార్థసారథి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి గుంటూరు జిల్లా రేపల్లి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వు లు వచ్చాయని అధికారులు తెలిపారు. చీరాల మునిసిపల్ కమిషనర్ విజయ పార్థసారధి పాలకొల్లు బదిలీపై వస్తున్నట్టు తెలిపారు.

విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏపీ స్టేట్ కమిషన్, ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యుడు జె.రాజేంద్ర ప్రసాద్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన స్థానిక ఏపీ ఎంజేపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. విద్య కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారం కూడా ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ నిర్వహకులు పాల్గొన్నారు.

షాపుల యజమానులు కార్మిక సంక్షేమ నిధి చెల్లించాలి

భీమవరం: భీమవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ 2వ సర్కిల్ పరిధిలోని ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల్లోని యాజమానులు తమ దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల సంక్షేమ నిధికి రూ.100 చెల్లించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె శివనాగ మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఏటా జనవరిలో కార్మిక సంక్షేమ నిధికి యాజమాన్యం రూ.70, కార్మికులు రూ.30 చొప్పున బోర్డు ఖాతాకు చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు సంక్షేమ నిధి చెల్లించని యజమానులు తక్షణం స్పందించాలని, లేకుంటే 1987 ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ నిధి చట్టాన్ని అతిక్రమించినట్లు భావిస్తామని శివనాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు.

వలంటీర్లతో పారదర్శక పాలన



ఇలపర్రులో వలంటీర్లను సత్కరించిన దృశ్యం

పెనుగొండ: వలంటీర్లు సేవాతత్పరతతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. మంగళవారం ఇలపర్రు పంచాయతీ వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ అవ్వాతాతలకు అండగా నిలుస్తోన్న వలంటీర్లపై చంద్రబాబు విమర్శలు చేయడం దారుణమన్నారు. వలంటీర్లు సీఎం జగన్ మానస పుత్రులు అన్నారు. వలంటీర్ వ్యవస్థను దేశ వ్యాప్తంగా అమలు చేయడానికి అన్ని రాష్ట్రాలు ముందుకొస్తున్న తరుణంలో ఓర్వలేక వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తూ వ్యవస్థను రద్దు చేయడానికి కుటిల యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్లు వెనుకడుగు వేయకుండా సేవలతో ముందడుగు వేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేండ్ర వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, పంచాయతీ సభ్యులు సాదే గోపాలం, కటికతల మోహనరావు, శీలం లక్ష్మి, గుణపాటి సంజీవ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పనులకు శంకుస్థాపన



చించినాడలో శ్మశాన వాటిక పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గం ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. చించినాడలో జిల్లా పరిషత్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టే హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. జగనన్న ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం పథకాలు జోడు గుర్రాల వలె పరుగులు తీసాయన్నారు. ఇదే రకమైన పాలన కోసం ప్రజలంతా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రాజమణి, ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి), ముదునూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మార్చి 1 నుంచి 8వతేదీ వరకు శ్రీవిజ్ఞాన వేదిక, ఇన్నర్ వీల్ క్లబ్, పట్టణ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ బ్రోచర్లను పురపాలక సంఘ కమిషనర్ ఎమ్ శ్యామల ఆవిష్కరించారు. స్వాతంత్రోద్యమంలో మహిళలు వీరోచిత పాత్ర పోషించారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలుగా నిర్వహించడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మార్చి 1న డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభ సభ నిర్వహిస్తామని, 2 నుంచి 5వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలో మహిళా సాధికారితపై వివిధ పోటీలు నిర్వహిస్తామని 6,7 తేదీల్లో పురపాలక సంఘం, మెప్మా మహిళా సంఘాలతో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇన్నర్ వీల్స్ క్లబ్ కార్యదర్శి సామంతపూడి మణి, డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయాధికారిణి కె. శిరీష అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి అల్లు వనజాక్షి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సరోజ మాట్లాడుతూ మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. 8వ తేదీ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, విశేష సేవాతత్పరులైన మహిళలకు సత్కారాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ శాఖ పరిధిలోని వివిధ కేసుల్లో ఉన్న మూడు వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెబ్ సీఐ కె.కాత్యాయని మంగళవారం తెలిపారు.